

టిడిపిలోకి ఇక్బాల్

చంద్రబాబు సమక్షంలో చేరిక



చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్న మహ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, హిందూపురం వైసిపి మాజీ సమన్వయకర మహమ్మద్ ఇక్బాల్ టిడిపిలో చేరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో బుధవారం నాడు టిడిపిలో చేరారు. తెలుగుదేశంలో ఇక్బాల్ చేరికతో ఆయనకు టిడిపి ఎటువంటి అవకాశాలు కల్పించనుందన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ప్రాధాన్యత లేదని వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. 2019 ఎన్నికలకు ముందు ఇక్బాల్ రిటైర్డు అయిన తరువాత వైసిపిలో చేరారు. కర్నూలు జిల్లా వాస్తవ్యుడు అయినప్పటికీ మైనార్టీలు అధికంగానున్న హిందూపురం అసెంబ్లీ స్థాయిలో పోటీ చేస్తే బాగుంటుందని భావించి వైసిపి ఆయన్ను అక్కడ పోటీలో నిలిపింది. అప్పటికే అక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న నవీన్ నిశ్చల్‌కు కాదని మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెట్టు ఇచ్చారు. అయితే నందమూరి బాలకృష్ణ చేతిలో ఆయన ఓటమి చెందారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఇక్బాల్‌కు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. వైసిపి హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్తగానూ ఉంటూ వచ్చారు. గతేడాది ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాధ్యతల నుంచి వైసిపి తప్పించింది. ఆ స్థానంలో దీపికకు పగ్గాలు అప్పగించారు. టికెట్ల కేటాయింపు సమయంలో ఇక్బాల్‌కు ఎక్కడా అవకాశం కల్పించకపోవడంతో మనస్థాపంతో ఆయన ఇటీవలే వైసిపికి రాజీనామా చేశారు. అదే విధంగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. ఇప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగుదేశంలో ఆయనకు ఎటువంటి అవకాశం లభిస్తుందన్న చర్చ నడుస్తోంది. మైనార్టీ నాయకుడిగా, అధికారిగా ఉన్న ఆయనకు టిడిపి ఏ మేరకు ప్రాధాన్యత కల్పించనుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టిక్కెట్ల కేటాయింపు తరువాత కొన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తులు కొనసాగుతున్నాయి. ఇక్కడ సర్దుబాటు కాని నియోజకవర్గాల్లో మార్పులు చేపట్టాలని టిడిపి భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో మహమ్మద్ ఇక్బాల్ పేరును ఒక నియోజకవర్గానికి పరిశీలిస్తున్నారన్న ప్రచారం ఉంది. మార్పు చేపట్టడం ద్వారా మైనార్టీల మద్దతును టిడిపి కూగట్టేందుకు వీలు కలుగుతుందన్న అభిప్రాయంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఏ స్థానంలో ఈ మార్పు ఉంటాదన్నదానిపై చర్చ ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో ఉంది. అనంతపురం, కదిరి, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్లు తదితర పట్టణాల్లో మైనార్టీల శాతం పది కంటే ఎక్కువగానే ఉంది. ఫలితాలపై వీరి ప్రభావం కొంత వరకు ఉండే అవకాశాలూ ఉన్నాయి. దీంతో జిల్లాలో మైనార్టీ నాయకుడిగా మహమ్మద్ ఇక్బాల్‌ను ముందుకు తీసుకొచ్చే ఆలోచనలో టిడిపి ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అవకాశం కల్పించలేకపోతే ఆయనుకు ఎక్కడ ప్రాధాన్యత కల్పించనున్నారన్నది చూడాల్సి ఉంది. ఇక్బాల్ సొంత జిల్లా అయినా కర్నూలులోనైనా వినియోగించుకునే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో మైనార్టీల ప్రభావం ఎక్కువగానే ఉంది.




నేడు ఈదుల్ ఫితర్

ఈద్గాల వద్ద ముస్లిములు ప్రార్థనలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈదుల్ ఫితర్‌ను ముస్లిములు గురువారం జరుపుకోనున్నారు. రంజాన్ మాసం ప్రారంభం నంచి నెల రోజుల పాటు కఠిన ఉపవాసదీక్షను ముస్లిములు పాటించారు. బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగను గురువారం నిర్వహించాలని మత పెద్దలు నిర్ణయించారు. ఈ ప్రకారం గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలను ఈద్గాల్లో చేస్తారు. ముస్లిములు అతి పెద్ద పండుగ ఎంతో వైభవంగా జరుపుకునే పండుగ ఇది. ఈ పండుగ సందర్భంగా ఉదయం ఈద్గాకు వెళ్లే ముందు దానం చేస్తారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలను చేస్తారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని హౌసింగుబోర్డు స్థలంలో ప్రార్థనలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, ధర్మవరం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల్లో ప్రార్థనలకు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేశారు. అనుకూలమైన చోట ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

చుక్కల్లో నిత్యావసరాలు..!



టమోటా ధర ఎరుపెక్కింది... కోడి ధర కొండెక్కింది. పచ్చి మిర్చి మంట పుట్టిస్తోంది. నూనె, పప్పులు ధరలూ ఆకాశాన్నంటాయి.. కూరగాయలు, నిత్యావసరాలు, మటన్, చికెన్ ధరలు కొండెక్కాయి. పెరిగిన ధరలు పేద మధ్యతరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. పెరిగిన ధరలు సామాన్య, మధ్యతరగత పేద కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. పండుగ పూట కనీసం రుచికరమైన బోజనం తినలేక నోటికి కుట్లు వేసుకునే పరిస్థితి నెలకొంది. కోడిని కోయలేం.. మటన్ కొనలేం అంటూ కోరికలు చంపుకుని నోరు కట్టుకునే పరిస్థితి దాపురించింది. ధరలు ఇలాగే కొనసాగితే పెరుగు పచ్చిడి మెతుకులే పంచభక్ష పరమాణ్ణాలుగా భావించి తినే పరిస్థితి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొండెక్కిన ధరలు..!
- కోడి కోయలేం..మటన్ కొనలేం..
- సామాన్యుడికి భారంగా చికెన్, మటన్ రేట్లు
- రంజాన్ పండుగ వేళ మరింత భారం

ప్రజాశక్తి-హిందూపురం

ఎండనకా, వాననకా కష్టపడి తెచ్చే నాలుగు రూపాయలతో కుటుంబాన్ని ఈదలేక రుచికరమైన తిండి అందించలేక తాను తినలేనక మధ్యతరగతి కుటుంబాలు సతమతం అవుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లాలంటే మండే ధరలతో గుండె ఆగినంత పని అవుతోందని బాధపడుతున్నారు. గతంలో రూ.150లు ఉంటే బ్యాగు నిండ కూరగాయలు వచ్చేవని, పెరిగిన ధరలతో రూ.500లు తీసుకెళ్లినా నిండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపదంతా కూరగాయలకు వెచ్చిస్తే ఇక సంసారాన్ని ఎలా ఈదాలో అర్ధం కాక సామాన్యుడి తలపట్టుకుంటున్నారు.

పండుగ రోజుల్లో దూరమవుతున్న ఆనందం

సంవత్సరం అంతా కష్టపడి పనిచేసినప్పటికీ కలుగని ఆనందం పండుగ రోజుల్లో కలుగుతుంది. ఆరోజు ఇంటిల్లిపాది రుచికరమైన భోజనం చేసుకుని తింటారు. ఇప్పటికే ఉగాది పండుగ ముగిసింది. గురువారం నాడు రంజాన్ పండుగ ఉంది. రంజాన్ పండుగ రోజు ఎక్కువగా మాంసాహారాన్ని చేసుకుంటారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇష్టమైన వంటలు చేసుకుని తినే అవకాశం కూడా లేకుండా పోయింది. గతంలో కేజీ చికన్ రూ.100 నుంచి రూ.120 ఉండగా ఇప్పుడు రూ.250 నుంచి రూ.300కు పెరిగింది. మటన్ ధర అయితే కిలో రూ.800 నుంచి 1000 వరకు ఉంది. గతంలో ఇంటికి రెండు కిలోలు తీసుకెళ్లే వారు పెరిగిన ధరలతో ఒక కిలోతోనే సరిపెడుతున్నారు. టమోటా 10 రోజుల క్రితం రూ.15 ఉంటే నేడు ఏకంగా రూ.40కు పెరిగింది. పెరిగిన ధరలతో ఏది కొనాలో అర్ధం కాక పేద మధ్యతరగతి కుటుంబాలు సతమతం అవుతున్నాయి.





హిందూపురంలోని ఓ మటన్ కేంద్రం



కొనలేకపోతున్నాం..

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కూరగాయలు ధరలు కొనలేని పరిస్తితి ఉంది. ఏ ఒక్కటి పట్టుకున్నా కిలో రూ.50 నుంచి రూ.150 వరకు ఉంది. పెరిగిన ధరలతో మార్కెట్ వైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ధరలను నియంత్రించాలి.

షభానా బాను, గృహిణి, హిందూపురం.



ధరలు మండి పోతున్నాయి..

నిత్యం వండే కూరల్లో వాడాల్సిన కూరగాయల ధరలు ఆకాశంలో ఉంటే వాటిని ఎలా కొనాలి.? ఎలా వండాలి..? చికన్ కిలో రూ.300 నుంచి రూ.350 వరకు ఉంది. మటన్ పరిస్థితి అలానే ఉంది. రంజాన్ పండుగ రోజు మంచి భోజనం కూడా తినలేని పరిస్థితి ఉంది.

ఫయాజ్, హిందూపురం.



అధిక ధరలను నియంత్రించాలి

పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించి సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చూడాలి. నిత్యం అవసరమైన కూరగాయల ధరలు అధికంగా ఉంటే సామాన్యుడి ఎలా బతకాలి. ప్రభుత్వాలు ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టారు. పెరిగిన ధరల ప్రభావం రంజాన్ పండుగపై పడుతోంది.

షేక్ నూర్‌జహా, గృహిణి.

12న 'సైకిల్ రావాలియాత్ర'

హాజరుకానున్న నందమూరి బాలకృష్ణ



ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12వ తేదీ శుక్రవారం నాడు టిడిపి ఆధ్వర్యంలో సైకిల్ రావాలి యాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యాత్ర 12వ తేదీ కదిరిలో ప్రారంభం అవుతంది. ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో యాత్ర ప్రారంభం అవుతుంది. కదిరి నుంచి ముదిగుబ్బ, బత్తపల్లి, అనంతపురం, అక్కడి నుంచి శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో యాత్ర కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టిడిపి నాయకులు ఇప్పటికే పూర్తి చేశారు.

కూలీలందరికీ ఉపాధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. రాప్తాడు గ్రామపంచాయతీ ప్రసన్నాయనపల్లి గ్రామం పండమేరు వంకలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూలీలతో ఉపాధి పనులు, కల్పిస్తున్న వసతులపై కలెక్టర్ ఆరా తీశారు. కూలీలు మాట్లాడుతూ రెండు నెలలుగా కూలీ డబ్బులు రాలేదని వీటిని వెంటనే ఇప్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కూలి బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి తెలియజేశారు. ఇక కూలీలందరూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈనెల 14వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఏపీడీ అనూరాధ, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఏవో రత్నాబాయితో పాటు ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారులు

ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు - నలుగురు మృతి.. ఐదుగురురికి గాయాలు



గుత్తి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన అన్నాదమ్ములు చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రహదారులు రక్తసిక్తం అయ్యాయి. బుధవారం నాడు పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఐదుగురు మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉపాగి పండగ మరుసటి రోజున చోటు చేసుకున్న ఈ ఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

అన్నాదమ్ముల మృత్యువాత

గుత్తి : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో అన్నదమ్ములు మతి చెందిన సంఘటన గుతి మండలంలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆర్.రామసుబ్బారెడ్డి, మహేశ్వరమ్మల పెద్ద కుమారుడు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి(26) వ్యవసాయ పనులు చేసేవాడు. చిన్న కుమారుడు ఆర్.శివనంద రెడ్డి(24) బీటెక్ పూర్తి చేశాడు. అన్నదమ్ములు ఇద్దరు గుత్తి సమీపంలోని బాట సుంకలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై వెళుతుండగా తాడిపత్రి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నదమ్ములు ఇద్దరూ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించారు. పోలీసుల సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారులు ఇద్దరూ ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరు మృతి

పరిగి : మండల పరిధిలోని మోద చెర్లోపల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పరిగి మండలం కొడిగేనహళ్లి పంచాయతీ పెద్దరెడ్డిపల్లికి చెందిన ఆదిమూర్తి(28) తన తల్లితో కలిసి ద్విచక్రవాహనంలో హిందూపురం వైపునకు వెళుతున్నాడు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రం తెరియుర్‌కు చెందిన శివన్న(26) హిందూపురం నుంచి ఆయన స్వగ్రామం వైపు ద్విచక్రవాహనంలో వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు చెర్లోపల్లి చెక్‌పోస్టు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాలు వేగంగా ఢీకొనడంతో ఆదిమూర్తి, శివన్నలు అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో మృతి చెందిన ఆదిమూర్తి ఒకగానొక్క కుమారుడు కావడంతో ఘటనా స్థలం అతని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ప్రమాద విషయం తెలుసుకున్న పరిగి ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.



ఆదిమూర్తి మృతదేహం వద్ద రోదిస్తున్న మహిళ



ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సు

పొలంలోకి దూసుకెళ్లిన ప్రయివేటు బస్సు

ఐదుగురికి గాయాలు- తప్పిన ప్రమాదం

పామిడి : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఓ ప్రయివేటు బస్సు పొలంలోకి దూసుకెళ్లిన ఘటన పామిడి మండలం గజరాంపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన ఎన్‌ఎల్01బి 1850 నెంబర్ గల వోల్వో బస్సు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ప్రయాణికులతో వెళ్తోంది. గజరాంపల్లి గ్రామం వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు పొలంలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుల్లో ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ జహీర్, మహమ్మద్, పశ్చిమబెంగాల్‌కు చెందిన అగన్ అలీ, బెంగుళూరుకు చెందిన అశోక్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ యూసఫ్‌కు రక్త గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108లో స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పామిడి పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

పన్ను భారం... ఎండ తీవ్రం..!

- కార్పొరేషన్‌లో పన్నుచెల్లింపుదారులకు నీడ కరువు
- నామమాత్రపు షామియానాల ఏర్పాటుతోనే సరి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



పన్నులు చెల్లించేందుకు కౌంటర్ వద్ద వేచి ఉన్న నగర ప్రజలు


అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్నుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. వడ్డీ రాయితో పేరుతో అధికారులు ప్రజల చేత ముందస్తు ఇంటి, కొళాయి పన్నులను కట్టించుకున్నారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి నుంచి రాత్రి 7 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ప్రకటనలు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. అయితే అధికారులు ముందస్తు పన్నులు వసూలు చేయించుకోవడంపై ఉన్న శ్రద్ధ, అక్కడ డబ్బు కట్టేందుకు వస్తున్న ప్రజలకు వసతి ఏర్పాటు చేయడంలో మాత్రం కన్పించడం లేదు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో పన్నులు చెల్లించేందుకు కార్పొరేషన్ కార్యాలయం వద్దకు వస్తున్న ప్రజలకు మెరుగైన నీడ వసతి లేక నానావస్థలు పడుతున్నారు. ప్రజలకు కనీసం నిల్చోనేందుకు నీడను ఏర్పాటు చేద్దామన్న ఆలోచన కూడా అధికారులు, పాలకవర్గంకు రాకపోవడం గమనార్హం. కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన నామమాత్రపు షామియానాలు ప్రజలకు ఉపశమనం ఇవ్వడం లేదు.

కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఎఎస్ స్థాయి అధికారి వచ్చినా అధికార యంత్రాంగంలో మాత్రం మార్పు రాలేదు. ఇప్పటి కింది స్థాయి అధికారుల వ్యవహారం ఎవరికి వారే ఎమునా తీరే అన్న చందంగా కన్పిస్తోంది. ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి పన్నులు చెల్లిస్తుంటే వారు కనీసం నిల్చునేందుకు కూడా నీడను ఏర్పాటు చేయని కార్పొరేషన్ యంత్రాంగంపై ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లించేందుకు నిలబడిన కౌంటర్ల వద్ద షామియానాలు వేయించలేదు. మండే ఎండలో పన్ను చెల్లింపుదారులు ఉన్నారని తెలిసినా కూడా అధికార యంత్రాంగంలో చలనం లేదు. ఏర్పాటు చేసిన ఒక శ్యామియానను చెట్టు నీడ ఉన్న ప్రాంతం వద్ద వేశారు. పన్నులు చెల్లించేందుకు నిల్చొనే కౌంటర్ వద్ద మాత్రం ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఇలాంటి వాటిని పరిశీలన చేసి అధికార యంత్రాంగాన్ని గాడిలో పెట్టాల్సిన ఉన్నతాధికారి ఆదేశాలకే పరిమితం అవుతున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ ఉన్నతాధికారి, అధికారులు మొద్దు నిద్ర వీడి పన్నులు చెల్లించేందుకు వస్తున్న ప్రజలకు నీడ వసతి పక్కాగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

'నన్ను నమ్మండి.. అసత్య ప్రచారం నమ్మొద్దు..

కార్మికులకు అండగా ఉంటా- సిఐటియు నేతలకు కమిషనర్ హామీ

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్



కార్మిక నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘస్వరూప్

'మున్సిపల్ కార్యాలయంలో నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. తప్పుడు ప్రచారాలను నమొద్దు.. నన్ను నమ్మండి.. కార్మికులకు అండగా ఉంటా..' అంటూ మున్సిపల్ కమిషనర్ మేఘస్వరూప్ హామీ ఇచ్చారు. బకాయి వేతనాలు ఇవ్వాలని రెండో రోజు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద క్లాప్, మలేరియా, కొవిడ్, గార్బేజ్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అయితే కార్మికుల సమస్యలు పరిష్కారం చేయలేని ప్రజా ఆరోగ్య అధికారి పోలీసులను కార్మికులపైకి ఉసిగొల్పారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసు అధికారి వాస్తవాలను గమనించి కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వేతనాలు పడలేదని గురించి నగరపాలక సంస్థ కమిషనర్ సీసీతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇందుకు ఆయన స్పందిసూ కమిషనర్ మేఘ స్వరూప్ ఎన్నికలకు సంబంధించిన విసి ప్రోగ్రాంలో ఉండటంతో అక్కడే ఉన్న అడిషనల్ కమిషనర్ హరిబాబుతో మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, రెగ్యులర్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ముత్తురాజు నల్లప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్‌తో చర్చలు జరిపారు. అనంతరం పోలీసు అధికారి మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన వేతనాలపై అధికారులతో చర్చించారు. తర్వాత మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌తో సిఐటియు నాయకత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను పిలిపించి సాయంత్రం 6 గంటలకు చర్చలు ఏర్పాటు చేయాలని కోరింది. ఈ ఘటనపై కమిషనర్ మేఘస్వరూప్ స్పందిస్తూ మున్సిపల్ కార్యాలయంలో కొందరు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేగాకుండా కొందరు అధికారులు పనిగట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనివల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇలాంటివి మీరు నమ్మవద్దన్నారు. కార్మికులకు ఎల్లప్పుడూ అండగా నేను ఉంటానన్నారు. తన పేరు చెప్పి వర్కర్లను కలెక్టర్ ఆఫీస్‌లో పనులకు చేర్పిస్తున్నారని తనకు తెలిసిందన్నారు. అలా ఎవరైనా ఎక్కించి ఉంటే తొలగిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బుధవారం సాయంత్రం 6 గంటలకు కార్మికుల అకౌంట్‌లోకి బకాయి జీతాలు పడే విధంగా కృషి చేస్తానని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నేతలకు హామీ ఇచ్చారు.

పండుగను ప్రశాంతంగా చేసుకోవాలి : ఎస్ఐ



ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న ఎస్ రాజశేఖర్‌రెడ్డి

నార్పల : మండలవ్యాప్తంగా ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముస్లిం మతపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రార్థన సమయంలో ఎలాంటి రాజకీయ ప్రస్తావనలు తీసుకురాకూడదన్నారు. ప్రార్థనల వద్దకి రాజకీయ నాయకులు ఎవరూ రాకూడదన్నారు. ప్రార్థనకు వెళ్లేటప్పుడు ఎవరైనా రాజకీయ కండువాలు, పార్టీ జెండాలు ఉండరాదన్నారు. నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఖాజీ ఫయాజ్‌బాషా, ముతవల్లి శంషాద్దీన్, మాజీ ముతవల్లి ఇక్బాల్‌బాషా, మతపెద్దలు కరీంహుస్సేన్, దాదు, మన్సూరు, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో పోలీసుల కవాతు

పామిడి : మండలంలోని వంకరాజుకాలువ, నెమళ్లపల్లి గ్రామాల్లో పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని మెయిన్ రోడ్డుల్లో కవాతు సాగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ

అప్రమత్తతతో వడదెబ్బ నివారణ : డాక్టర్ అరుణ

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరిసే వడదెబ్బ నివారణ పొందవచ్చని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ అరుణ సూచించారు. బుధవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి ఏవిధమైన నివారణ చర్యలు చేపట్టాలో వివరించారు. వడగాడ్పుల కారణంగా వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తాపించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు లీటర్ల నీటిని తీసుకోవాలన్నారు. రానున్న రెండు నెలలపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుందన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడకు చేర్చాలని, చల్లటి వస్త్రంతో శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు తుడవాలన్నారు. వడదెబ్బతో అపస్మారక స్థితిలో ఉన్న రోగిని వీలైనంత త్వరగా సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. వీలైనంత వరకూ ఎండలో తిరగకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూపర్వైజర్లు, స్టాఫ్‌నర్స్, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

వైద్యాధికారి వెంకటేష్‌నాయక్

ప్రజాశక్తి-వజ్రకరూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేష్‌నాయక్

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 27 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు చేశారు. అనంరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భస్త కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకారం మందులు, మాత్రలు, ఎండాకాలం వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుఊ నీరు అధికంగా తాగాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం వినియోగించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలో తిరగరాదన్నారు. లింగవివక్ష సరికాదన్నారు. అడమగ పిల్లల పట్ల సమదృష్టితో వ్యవహరించాలన్నారు. బ్రూణహత్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఆసుపత్రిలో కాన్పులు కావాలని ఇంటిలో కాన్పులు సురక్షితం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, సీఓ భగవాన్‌దాస్, స్టాఫ్ నర్సులు, లాబ్‌టెక్నీషియన్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు

అనంతపురం క్రైం : జిల్లాలోని ముస్లిములకు ఎస్పీ అమిత్ బర్దర్ బుధవారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సేవానిరతి, పవిత్రతకు ప్రతీకైన రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా చేసుకుని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దైవచింతన, భక్తిశ్రద్ధలతో కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ముస్లిం సోదరులు తమ ఇష్టదైవాన్ని కొలవడం ఆదర్శప్రాయమన్నారు.

నార్పల : రంజాన్ పండుగను పురస్కరించుకుని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో ముస్లిములకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం టిడిపి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇందులో భాగంగా టిడిపి ఎన్నో పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యంగా టిడిపి వ్యవస్థపాకులు ఎన్టీఆర్ అప్పట్లోనే మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చేసి ఉపాధి కల్పించారన్నారు. అంతేగాకుండా ఆర్థికసాయం, ముస్లింలు రాజకీయంగా ఎదగడానికి స్థానిక సంస్థలలో కో-ఆప్షన్ పదవులు కల్పించారన్నారు. తర్వాత చంద్రబాబు రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, మజీద్ మత పెద్దలకు గౌరవ వేతనం, విదేశీ విద్యా పథకం, కంప్యూటర్స్ శిక్షణ, ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి కుట్టు విషన్లను పంపిణీ చేశారన్నారు. హజ్ యాత్రికుల కోసం హజ్‌హౌస్ కట్టించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పేద ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందకుండా రద్దు చేశారని విమర్శించారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని, అధికారంలోకి రాగానే వారి పథకాలన్నీ పునరుద్ధరిస్తామన్నారు.

వజ్రకరూరు : రంజాన్ పండుగ సందర్భంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈమాసంలో ముస్లింలంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా అల్లాహ్ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారన్నారు. అల్లాహ్ రక్షణ, కరుణ పొందాలని ఆకాంక్షించారు.


శింగనమల : ముస్లిం సోదరులకు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు (ఈదుబారక్) తెలిపారు. క్రమశిక్షణ, దాతత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలంతా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా అల్లాహ్ను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారన్నారు. అల్లాహ్ రక్షణ, కరుణ పొందాలని ఆకాంక్షించారు.

పామిడి : నియోజకవర్గ ముస్లిములకు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెంక్రటామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దీవెనలతో ప్రపంచం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సర్వమానవ సమానత్వానికి, కరుణకు, ధాతృత్వానికి రంజాన్ పండగ ప్రతీక అన్నారు. దివ్య ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం క్రమశిక్షణ, ఐకమత్యం, పేదలకు సాయానికి పండుగ నిదర్శమన్నారు. అలాగే మైనారిటీల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అల్లా చల్లటి దీవెనలు, మీ ఆశీస్సులు సదా తోడుంటాయని ఆకాంక్షించారు.

ప్రజల ఆరోగ్యానికి 'హోమియో' రక్షణ కవచం

ప్రభుత్వ సీనియర్ హోమియో వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు

ప్రజాశక్తి-అనంతపురం



వడదెబ్బ నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న హోమియో వైద్యులు

ప్రజల ఆరోగ్యఆనికి హోమియో వైద్యం రక్షణ కవచం లాంటిది అని ప్రభుత్వ సీనియర్ హోమియో వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా బుధవారం స్థాని ప్రభుత్వ హోమియో వైద్యశాలలో హోమియో పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం వల్ల రోగికి స్వస్థత చేకూరాలే తప్ప మందుల దుష్ప్రభావం కాకూడదన్నారు. దీనికితోడు మరెన్నో కొత్త సమస్యలు రాకూడదన్నారు. అనంతరం పాతూరులోని విద్యుత్ పవర్ ఆఫీస్‌లో వడదెబ్బపై ప్రభుత్వ హోమియో వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా తిరుపతినాయుడు మాట్లాడుతూ ఎండలు ఎక్కువ అవడంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆయుష్ శాఖలో ఒక విభాగమైన హోమియో మందులను ఉచితంగా అందజేస్తూ వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, విపరీతమైన దాహం, నీరసం, గుండె వేగంగా కొట్టుకోవడం, వాంతులు అవడం, కండరాలు బిగుసుపోవడం, చర్మం పొడిగా, ఎర్రగా కందిపోవడం, శ్వాసవేగంగా పీల్చుకోవడం, ఫిట్స్ రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించాలన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని గాలి తగిలే విధంగా చూసుకుని దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఉదయం 10 గంటల తర్వాత బయటికి పోకుండా చూసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. చెవులకు వేడిగాలి తగలకుండా చూసుకోవాలన్నారు. ఎండలో ప్రయాణం చేసేటప్పుడు కొబ్బరినీళు ,, గ్లూకోస్, మంచి పండ్ల రసాలని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పవర్ ఆఫీస్ డిఇఇ లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ లక్ష్మీబాయి, కృష్ణప్రియ, ప్రభుత్వ హోమియో వైద్యశాల ఫార్మాసిస్ట్ కె.సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది శాంతమ్మ, మానవ హక్కుల సంఘం దక్షిణ భారతదేశ కార్యదర్శి ఆవుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి 'ఊసరవెల్లి' రాజకీయాలు

వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, అనంత

ప్రజాశక్తి-అనంతపురం



మహిళతో మాట్లాడుతున్న శంకరనారాయణ, అనంత వెంకటరామిరెడ్డి

టిడిపి అధినేత చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలు అని వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం నారాయణపురం పంచాయతీలోని నాగిరెడ్డిపల్లిలో 'ఇంటింటికీ వైసీపీ' నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అనంతపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. దీంతో ఎక్కడికి వెళ్లినా సాదరంగా ఆహ్వానిస్తూ జగన్ వెంటే ఉన్నామని భరోసా ఇస్తున్నారన్నారు. ఇకపోతే గతంలో వాలంటీర్ల వ్యవస్థను కించపరచిన చంద్రబాబు నేడు వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రలోభాలకు గురి చేస్తున్నారు. చంద్రబాబు తీరును ప్రజలంతా గమనిస్తున్నారు. గతంలో వాలంటీర్ల అంతు చూస్తామని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అలాంటిది ఇప్పుడు చేస్తున్న వ్యాఖ్యలను చూస్తుంటే ఊసరవెల్లి కూడా మార్చలేని రంగులను చంద్రబాబు మారుస్తున్నారన్నారు. అలాగే గతంలో మోదీని విమర్శించిన చంద్రబాబు నేడు ఆయన కాళ్లు పట్టుకున్నాడని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా వైసీపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో వైసీపీ విజయం సాధిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ మహమ్మద్ వసీం, నాయకులు చింతా సోమశేఖరరెడ్డి, రమేష్‌గౌడ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, శివరామ్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, రామసుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మల్లెల వేణు, శ్రీనివాసులు, మునిశేఖర్, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో టిడిపి అభ్యర్థి దగ్గుపాటి

జోరుగా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రచారంలో జోరు పెంచింది. ఓవైపు దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు సతీమణి శ్రీలక్ష్మీ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా 36వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ రాజారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి 'బాబు సూపర్ సిక్స్' పథకాలతోపాటు టీడీపీ అధికారంలోకి రాగానే దగ్గుపాటి చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. కాలనీల్లో మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కొన్ని చోట్ల హారతులు పట్టి అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజారావు, టిడిపి నాయకులు రాహుల్, లలిత, అనిలా, శ్రీలత, అనితా, సులోచనమ్మ, ఆర్.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన ఎంపిటిసి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల నుంచి మార్పులు చేర్పులు మొదలయ్యాయి. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ నారాయణపురం పంచాయతీలో ఎంపిటిసి-3 మహబూబ్‌జాన్ టిడిపిలో చేరారు. ఆమెతో పాటు మరో 100 కుటుంబాల వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎంపిటిసి భర్త హాజీవలి మాట్లాడుతూ తాము వైసీపీలో ఇమడలేకపోతున్నామన్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమన్న నమ్మకంతో పార్టీలో చేరినట్లు చెప్పారు.

రాష్ట్రంలో కూటమిదే విజయం

అట్టహాసంగా 'కూటమి' ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థుల పరిచయ సభ-నగరంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులదే వచ్చే ఎన్నికల్లో విజయమని జనసేన, టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అధ్యక్షతన కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిచయ సభ, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. న్యూటౌన్ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీకంఠం సర్కిల్, సప్తగిరి సర్కిల్, జడ్పీ కార్యాలయం, అంబేద్కర్ ఫ్లైఓవర్ మీదుగా సాగింది. జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌తోపాటు కూటమి అభ్యర్థులు దగ్గుపాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ స్వయంగా బైక్‌లు నడుపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సమావేశ చోటుకు రాగానే జనసేన నాయకులు భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అనంరం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిసి.వరుణ్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. జనసేన తరపున తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అధికార అహంకార వైసిపి ఆటలు ఇక సాగవన్నారు. వైసిపి అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం ఏర్పడితే జరిగే మేలును క్షేత్రస్థాయిలో వివరిస్తామన్నారు. కావున అనంతపురం పార్లమెంట్, అర్బన్ నియోజకవర్గంలో ప్రజలు కూటమి అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుపాటి ప్రసాద్‌ను ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ ఆధ్వర్యంలో ఇంత భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. కమిట్మెంట్ కలిగిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజావ్యతిరేక వైసిపి ప్రభుత్వాన్ని కూలదోయాలంటే ఐక్య పోరాటంతో ముందుకెళ్లాలన్నారు. అనంతపురం అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంత భారీసంఖ్యలో తరలిరావడం చూస్తుంటే తన విజయం తథ్యమన్నారు. టిసి.వరుణ్ తమ పట్ల చూపుతున్న ఆదరణ అద్భుతమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం సీనియర్ నాయకులు జనసైనికులు, వీరమహిళలు, పార్టీ శ్రేణులు, జనసేన మద్దతు తెలిపే కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాII.వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో బుధవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఏప్రిల్ 18వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియను సజావుగా చేపట్టేందుకు ఏర్పాట్లన్నీ ముందుగా పూర్తి చేయాలని ఆదేశించారు. నామినేషన్లకు సంబంధించిన మెటీరియల్ మొత్తం పూర్తిగా చదివి ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకోసం అన్ని విధాలా సన్నద్ధం కావాలన్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అభ్యర్థి నామినేషన్ దరఖాస్తు చేసిన రోజే స్క్రుటినీ ప్రక్రియ చేపట్టాలని, ఏవైనా వివరాలు తక్కువగా ఉంటే వెంటనే అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈ ప్రక్రియ కోసం కలెక్టరేట్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సమస్యలను తెలియజేయండి

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ తెలియజేశారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు - 2024పై జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫామ్-6, చిరునామా మార్పు చేసుకోవాలంటే ఏప్రిల్ 14వ తేదీ చివరి తేదీ అన్నారు. సంబంధిత బిఎల్ఒ, తహశీల్దార్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల అనుమతుల కోసం సువిధ, ఎన్కోర్ యాప్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అనవసరమైన ఫిర్యాదులను ఇవ్వకుండా, నిజాయితీగా ఫిర్యాదులను అందించి సహకరించాలని కోరారు. ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలుపవచ్చున్నారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సున్నీ రోషన్ మసీదులో చోరీ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ బజార్‌లో ఉన్న సున్నీరోషన్ మసీదులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుండగుడు మసీదులోకి చొరబడి మూలన మూడేళ్లగా ఉన్న హుండీని పగలగొట్టాడు. అందులో ఉన్న రూ.15వేలు నగదును దోచుకెళ్లాడు. చోరీ దృశ్యాలు మసీదులోని సీసీ కెమెరా ఫుటేజీలో బయటపడ్డాయి. ఘటనపై మసీదు కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు



మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

శింగనమల : మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న లింగుట్ల పుల్లయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడి నుంచి 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ముస్లిముల ప్రార్థనల్లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రభాకర్‌చౌదరి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

అనంతపురం కలెక్టరేట్ : ముస్లిముల పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముస్లిం మైనార్టీలు హాజరై ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు బుద్ధి చెప్పాలి

పామిడి : మాదిగ జాతి అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్న సీఎం జగన్‌కి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ పోరాట సమితి రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి మండ్ల రాజు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాదిగ పోరాట సమితి రాష్ట్ర నాయకత్వం వైసిపికి అనుకూలంగా పని చేస్తోందన్నారు. మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకిగా ఉన్న సిఎం జగన్‌కు మద్దతుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మాదిగల మనుగడను దెబ్బతీసేవిధంగా దళారీలను ప్రోత్సహిస్తున్న వైసీపీ పాలన ముగియడానికి సమయం దగ్గర పడిందన్నారు. టిడిపి హయాంలోనే మాదిగలకు మేలు జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ పోరాట సమితి చర్యలను నిరసిస్తూ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా రాబోయే ఎన్నికల్లో వర్గీకరణకు అండగా నిలిచే కూటమికి మద్దతు తెలుపుతున్నామన్నారు. వైసిపి ఓటమే తమ లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి కుమారుడు మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

వజ్రకరూరు : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన మాజీ ఎంటిసి శంకర్‌రెడ్డి కుమారుడు అరవింద్ ప్రసాద్‌రెడ్డి (26) మృతికి పలువురు బుధవారం నివాళులర్పించారు. అరవింద్ ప్రసాద్‌రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో కాంట్రాక్ట్ పనులు చేయించేవాడు. ఇందులో భాగంగా సిరిసిల్ల వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెళ్తూ రోడ్డు పక్కన నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం స్వగ్రామం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి మల్లికార్జున, సర్పంచి రామాంజనేయులురెడ్డి, రాముర్డ్డి, జగదీష్, హంపయ్య, ప్రసాద్, ఉమాశంకర్, అశోక్‌రెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీలోగా ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లిస్తే ఐదుశాతం రాయితీని పొందవచ్చున్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా నరసింహస్వామి శ్రీముడి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి శ్రీముడి కార్యక్రమం బుధవారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా మాఘ పౌర్ణమి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం రోజున మాలాధారణ ధరించిన 40 మంది భక్తులు 48 రోజుల దీక్ష అనంతరం బుధవారం ఉగాదిని పురస్కరించుకుని మాలను తీసివేశారు. ఉదయం ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆలయం కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యం వంటి పూజలు చేశారు. శ్రీముడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి కాలినడకన నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద మాలాదరణ స్వాములవారికి మెట్ల పూజ నిర్వహించి శ్రీముడిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, గౌని ఉపేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నరసింహులు, కోశాధికారి సత్యనారాయణ, గురు రాఘవేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'అంబికా'ను కలిసిన నార్పల జనసేన నాయకులు

నార్పల : ఎన్‌డిఎ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను మండల జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో అంబికాను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును కక్షపూరితంగా జైల్లో పెడితే అండగా నిలిచిన ఏకైన వ్యక్తి పవన్‌కళ్యాణ్ అన్నారు. అలాంటి వ్యక్తి ఎన్నికల్లో కూడా కలిసి కొనసాగడం సంతోషకరమన్నారు. ఆయన లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, పొన్నతోట రామయ్య, వినోదం నారాయణస్వామి, సిద్ధరాచెర్ల హరినాథ్, శివమోహన్, వినోదం, లోకేష్, చామలూరు విజయ్, నరసింహా, జనసైనికులు పాల్గొన్నారు.